


VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 83 | ఆదివారం 23 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు



- పర్యావరణ పరిరక్షణను ఇంటింటి ఉద్యమంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- వంటగది వ్యర్థాలతో సేంద్రియ ఎరువు, మురుగునీటికి ఇంటి వద్దే పరిష్కారాలు
- ఆదర్శంగా నిలుస్తున్న నెట్‌జీరో విధానాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళిక

2

# రేవంత్ రెడ్డి అమెరికా టూర్‌కు కేంద్ర అనుమతి నిరాకరణ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీలతో భేటీలు కూడా ఆయన పర్యటనలో భాగంగా ఉండటమే ఇందుకు కారణంగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లు ఎన్డీటీవీ పేర్కొంది. అమెరికా, బ్రిటన్ పర్యటనలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి కోరింది.



2

## కెనడా కీలక నిర్ణయం.. అమెరికాతో వాణిజ్య చర్చలు బంద్

- 2,000 కోట్ల డాలర్ల కెనడా ఉత్పత్తుల పై 50 శాతం టారిఫ్
- గత ఏడాది ఇరు దేశాల మధ్య 880 బిలియన్ డాలర్ల వాణిజ్యం
- చర్చలకు గడువు పొడిగించినా కుదరని ఒప్పందం



2

## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

అమెరికాతో నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని ఇరాన్ పిలుపునిచ్చింది. తాము శక్తిమంతమైన, గౌరవప్రదమైన స్థితిలో ఉన్నప్పుడే యుద్ధాన్ని ముగించడం మేలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు.



2

## నారా లోకేశ్.. విద్యార్థుల్లో విద్యార్థిగా.. టీచర్లలో టీచర్ గా..!



2

విద్యావ్యవస్థలో క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనుసరిస్తున్న వినూత్న పంథా అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయ పర్యటనలకు భిన్నంగా, ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ఆయన నేరుగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమవుతున్నారు. వారిలో ఒకరిగా కలిసిపోయి, సమస్యలను అడిగి తెలుసుకుంటూ అక్కడికక్కడే పరిష్కారాలకు చొరవ చూపుతున్నారు. "ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్" రూపకల్పనే లక్ష్యంగా ఆయన చేస్తున్న ఈ ప్రయత్నం విద్యావర్గాల్లో కొత్త ఆశలు రేపుతోంది. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివీస్ సంస్థ సహకారంతో ఆధునీకరించిన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు.

## హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత రాకెట్ బట్టబయలు

- అక్రమ పాన్ మసాలా యూనిట్ పై సీజీఎస్టీ అధికారుల దాడులు
- సుమారు రూ. 160 కోట్ల మేర పన్ను ఎగవేసినట్లు నిర్ధారణ
- భారీగా ముడిసరుకు, 40 యంత్రాలు స్వాధీనం.. కీలక వ్యక్తి అరెస్ట్



2

## నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న సూత్రధారులను గుర్తించాలి



2

- తనను, తన కుటుంబాన్ని కొందరు నేతలు లక్ష్యంగా చేసుకున్నారని ఆవేదన
- విచారణ జరుగుతుండగా బహిరంగ విమర్శలు చేయడం సరికాదని సూచన
- ముఖ్యమంత్రి పై కుమార్తె వ్యాఖ్యలను సురేఖ ఖండించాలని చెప్పిన మల్లు రవి

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 23 ఆగష్టు 2026

## కెనడా కీలక నిర్ణయం.. అమెరికాతో వాణిజ్య చర్చలు బంద్

అమెరికా–కెనడా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. అమెరికాతో వాణిజ్య చర్చలను కెనడా ప్రధాని మార్క్ కార్నీ నిలిపివేశారు. చివరి దశ చర్చల్లో అమెరికా ప్రతిపాదించిన కొత్త షరతులు అన్యాయంగా, ఆర్థికంగా నష్టదాయకంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు కెనడా నుంచి వచ్చే సుమారు 2,000 కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్ విధించేందుకు అమెరికా సిద్ధమైంది. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ మాట్లాడుతూ.. కెనడాకు ఇతర ప్రధాన ఎగుమతి దేశాల కంటే మెరుగైన వాణిజ్య సదుపాయాలు కల్పించేందుకు అమెరికా ముందు కొచ్చిందన్నారు. అయితే కెనడా చివరి నిమిషంలో కొత్త డిమాండ్లు చేయడంతో పాటు గతంలో ఇచ్చిన కొన్ని హామీల నుంచి వెనక్కి తగ్గిందని ఆరోపించారు. కెనడా ప్రధాని కార్నీ మాత్రం అమెరికా చివరి నిమిషంలో మార్చిన నిబంధనలు న్యాయబద్ధంగా లేవని అన్నారు. వాటితో ఆర్థికంగా నష్టమేనని పేర్కొన్నారు. కెనడా కార్మికులు, వ్యాపారాలకు అదనపు మద్దతు ప్రకటించనున్నట్లు తెలిపారు. అమెరికా విధించనున్న 50 శాతం టారిఫ్‌లు కెనడా నుంచి అమెరికాకు ఏటా వెళ్లే మొత్తం ఎగుమతుల్లో దాదాపు 5 శాతాన్ని ప్రభావితం చేయనున్నాయి. హాకీ స్టిక్స్ నుంచి వైద్య పరికరాల వరకు పలు ఉత్పత్తులపై ఈ ప్రభావం పడనుంది. చర్చలు కొనసాగేందుకు ట్రంప్ టారిఫ్ గడువును మూడు రోజులు పొడిగించినా ఒప్పందం కుదరలేదు. గత ఏడాది అమెరికా–కెనడా మధ్య వస్తువులు, సేవల వాణిజ్యం 880 బిలియన్ డాలర్లకు చేరింది. కెనడా ఎగుమతుల్లో దాదాపు 72 శాతం అమెరికాకే వెళు న్నాయి. దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య వాణిజ్య వివాదాలు ఉన్నప్పటికీ సన్నిహిత మిత్రదేశాలుగా కొనసాగాయి. అయితే కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా మార్చాలంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, తాజాగా టారిఫ్‌ల పెంపు రెండు దేశాల సంబంధాల్లో కొత్త ఉద్రిక్తతలకు దారితీశాయి.

## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

అమెరికాతో నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని ఇరాన్ పిలుపునిచ్చింది. తాము శక్తిమంతమైన, గౌరవ ప్రదమైన స్థితిలో ఉన్నప్పుడే యుద్ధాన్ని ముగించడం మేలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం వైద్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. “మనం శక్తిమంతంగా,గౌరవంగా ఉన్న ఈ సమయంలోనే యుద్ధానికి ముగింపు పలకడం ఉత్తమం” అని పెజెష్కియాన్ అన్నారు. ఈ పోరాటంలో ఇరాన్ విజయం సాధించిందని ప్రపంచం గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి అమెరికా పాఠశాలలు, ఆసుపత్రుల పై దాడులు చేస్తోందని, అందుకే ప్రపంచవ్యాప్తంగా అమెరికా పట్ల ద్వేషం పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ ఏడాది ఆరంభంలో అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ప్రారంభమైన ఈ సంఘర్షణ, ప్రస్తుతం ప్రతిష్ఠంభనలో కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో ఇబ్బందులు, అమెరికా నౌకాదళ దిగ్బంధనం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు, వాషింగ్టన్ ఆర్థిక ఒత్తిడిని తీవ్రతరం చేస్తూ కొత్త ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. చర్చలకు మార్గం సుగమం చేసేందుకు ఒమన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. జూన్‌లో అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందంలో ఇరాన్ లొంగిపోయినట్లు ఎలాంటి నిబంధనలు లేవని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులకు తలొగ్గేది లేదని, అవసరమైతే గట్టిగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. దేశంలో ఆర్థిక ఒత్తిళ్లు, అంతర్జాతీయంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యం లో, శక్తిమంతమైన స్థితి నుంచే తాము శాంతి చర్చలకు సిద్ధమనే సంకేతాలు పంపేందుకే టెహ్రాన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత రాకెట్ బట్టబయలు

హైదరాబాద్‌లో భారీ జీఎస్టీ ఎగవేత గుట్టును హైదరాబాద్ సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) అధికారులు రట్టు చేశారు. నగర శివార్లలోని ఒక రేకుల షెడ్డులో రహస్యంగా నిర్వహిస్తున్న పాన్ మసాలా, పొగాకు తయారీ యూనిట్‌పై దాడి చేసి, సుమారు రూ. 160 కోట్ల మేర పన్ను ఎగవేతను గుర్తించారు. ఈ అక్రమ దందాను నిర్వహిస్తున్న కీలక వ్యక్తిని అధికారులు అరెస్ట్ చేశారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ యూనిట్‌లో ఎటువంటి అనుమతులు లేకుండానే పాన్ మసాలా, సుగంధ జర్దా వంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. తనిఖీల సమయంలో లెక్కల్లో చూపని 40 ప్యాకింగ్ యంత్రాలను అధికారులు కనుగొన్నారు. ఈ ఫ్యాక్టరీలో మొత్తం 56 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇక్కడ తయారైన సరుకును జీఎస్టీ, హెచ్ఎస్ఎన్ఎస్ సెస్, సెంట్రల్ ఎక్సైజ్ సుంకాలు చెల్లించకుండానే మార్కెట్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దాడుల్లో భాగంగా రవాణాకు సిద్ధంగా ఉన్న రూ. 76 లక్షల విలువైన సరుకుతో పాటు, 5,500 కిలోల రెడీమేడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 2,015 కిలోల పాన్ మసాలా మిశ్రమం, 810 కిలోల పొగాకు, ప్యాకింగ్ మెటీరియల్‌తో పాటు అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేశారు. పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులపై 2026 ఫిబ్రవరి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త పన్ను నిబంధనల నుంచి తప్పించుకోవడానికే ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. పట్టుబడిన స్టాక్, యంత్రాల సామర్థ్యం, పనిచేస్తున్న కార్మికుల సంఖ్య ఆధారంగా మొత్తం పన్ను ఎగవేత రూ. 160 కోట్లుగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

# రేవంత్ రెడ్డి అమెరికా టూర్‌కు కేంద్ర అనుమతి నిరాకరణ

అమెరికా, బ్రిటన్ పర్యటనలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి కోరింది. బ్రిటన్ పర్యటనకు అంగీకరించిన కేంద్రం అమెరికా టూర్‌కు మాత్రం అనుమతి నిరాకరించింది. అమెరికా పర్యటనలో జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీలను ప్రతిపాదించినప్పటికీ.. ఈ కార్యక్రమాలను విదేశాంగ శాఖతో చర్చించలేదని, రాజకీయ అనుమతి ప్రక్రియలో భాగంగా సమాచారం పంపలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విదేశీ పర్యటనలకు అనుమతి ఇచ్చే ముందు ముఖ్యమంత్రి వంటి ప్రజాప్రతినిధుల ప్రతిపాదిత కార్యక్రమాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుంది. పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమాలు ఉన్నాయా? అన్నది పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తుంది. ఈ అంశంపై శుక్రవారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. రేవంత్‌రెడ్డి బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని, అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలు కొన్ని ప్రమాణాలకు తగినవిగా ఉండాలని స్పష్టం చేశారు. అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణాలు సరిపోలకపోవడంతో అనుమతి నిరాకరించినట్లు వెల్లడించారు. అమెరికాలో తెలుగు ప్రజల సంఖ్య భారీగా ఉండటంతో రేవంత్‌రెడ్డి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. అమెరికాలోని భారతీయ అమెరికన్లలో తెలుగు సమాజం సుమారు 14 శాతం ఉంటుందని, 12 లక్షలకు పైగా తెలుగు ప్రజలు అక్కడ ఉన్నారని సమాచారం. అయితే ఈ వ్యవహారం తెలంగాణలో రాజకీయ వివాదానికి దారితీసింది. అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించి, బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇవ్వడంపై ప్రశ్నలు తలెత్తాయి. అయితే కేంద్ర ప్రభుత్వ వర్గాలు మాత్రం ఈ నిర్ణయం రాజకీయ కక్షతో తీసుకున్నది కాదని, కేవలం సాంకేతిక అంశాల ఆధారంగానే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినట్లు చెబుతున్నాయి.

# అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

పర్యావరణ పరిరక్షణను ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఇంటింటి ఉద్యమంగా మార్చి, గ్రామాలను స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు 'నెట్‌జీరో' విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించి, పర్యావరణహిత జీవనశైలిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. శనివారం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలవరం కోడూరు గ్రామంలో సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా, గ్రామంలో అమలు చేస్తున్న నెట్‌జీరో కార్యక్రమాల గురించి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటింటా సౌర విద్యుత్ వినియోగం, పరిశుభ్రమైన వంట విధానాలు, తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ, మురుగునీటిని ఇంటి వద్దే శుద్ధి చేయడం వంటి పద్ధతుల ద్వారా గ్రామాలను ఎలా ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారో తెలిపారు.

**క్షేత్రస్థాయిలో కార్యక్రమాల పరిశీలన**

కార్యక్రమం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సీఎం చంద్రబాబు, గ్రామానికి చెందిన జె. మహేశ్వరరావు ఇంటిని సందర్శించారు. మహేశ్వరరావు కుటుంబం చేపడుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను సీఎం ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. వంటింటి నుంచి వెలువడే తడి వ్యర్థాలను ప్రత్యేక కంపోస్ట్ గుంతలో వేసి సేంద్రియ ఎరువుగా మార్చుతున్న విధానాన్ని వారు ముఖ్యమంత్రికి చూపించారు. దీనివల్ల ఎరువుల ఖర్చు తగ్గడమే కాకుండా, వ్యర్థాల నిర్వహణ భారం కూడా తగ్గుతుందని వివరించారు. అలాగే, ఇంటి నుంచి వెలువడే మురుగునీటిని బయటకు వదలకుండా, ఆవరణలోనే నిర్మించిన ఇంకుడు గుంతలోకి మళ్లిస్తున్న విధానాన్ని సీఎం పరిశీలించారు. ఈ 'ఇన్‌సిటు వేస్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్' వల్ల రోడ్లపై మురుగు నిలవకుండా, దోమల బెడద తగ్గి, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని లబ్ధిదారులు తెలిపారు. ప్రభుత్వం 'దీపం' పథకం కింద సిలిండర్లు అందిస్తున్నప్పటికీ, ఇండక్షన్ స్టవ్ వాడకం ద్వారా గ్యాస్‌పై ఆధారాపడటాన్ని తగ్గించుకుంటున్నామన్నారు. ఇంటిపై ఏర్పాటు చేసిన 3 కిలోవాట్ల సోలార్ ప్యానెల్ ద్వారా వచ్చే విద్యుత్‌తోనే ఇండక్షన్ స్టవ్ నడుపుతుండటంతో కరెంట్ బిల్లు కూడా ఆదా అవుతోందని వివరించారు. ఈ ఆదర్శ విధానాలను పాటిస్తున్న మహేశ్వరరావు కుటుంబాన్ని ముఖ్యమంత్రి అభినందించి, వారితో సెల్ఫీ దిగారు. అలవరం కోడూరులో అమలవుతున్న నెట్‌జీరో విధానాలను రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు విస్తరింపజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# నారా లోకేశ్.. విద్యార్థుల్లో విద్యార్థిగా.. టీచర్లలో టీచర్ గా..!

విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివీస్ సంస్థ సహకారంతో ఆధునీకరించిన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. గతంలో తాను ఈ పాఠశాలను సందర్శించినప్పుడు క్రీడా మైదానం మోకాలి లోతు నీటిలో ఉండటాన్ని గమనించారు. విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకుని, దివీస్ యాజమాన్యంతో మాట్లాడి అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాలను అభివృద్ధి చేసేలా ఒప్పించారు. నేడు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారిన తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆధునాతన ప్లేగ్రౌండ్‌ను చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ప్రసంగాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు మైక్ అందించి వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకున్నారు. వారు అడిగిన సరదా ప్రశ్నలకు అంతే ఉత్సాహంగా సమాధానాలిచ్చి వారిలో ఒకరిగా కలిసిపోయారు. అనంతరం విజయనగరం పర్యటనలోనూ లోకేశ్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. దాసన్నపేట బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. అక్కడ ఉపాధ్యాయులకు కెమిస్ట్రీపై పునశ్చరణ తరగతులు జరుగుతుండగా, వారికి ఎలాంటి ఆటంకం కలిగించకుండా నిశ్శబ్దంగా వెళ్లి ఉపాధ్యాయుల మధ్య కూర్చున్నారు. శ్రద్ధగా పాఠం వింటూనే, విరామ సమయంలో వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన అంశాలపై తక్షణమే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కార మార్గాలను అన్వేషించారు. మంత్రి హోదాను పక్కనపెట్టి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకునేందుకు లోకేశ్ అనుసరిస్తున్న ఈ ఆచరణాత్మక విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది సమస్యల పరిష్కారం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని అభిప్రాయపడుతున్నారు.

# నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న సూత్రధారులను గుర్తించాలి

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మరోసారి లేఖ రాశారు. కొందరు పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆమె ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ ఛైర్మన్ మల్లు రవిని ఆమె కోరారు. కమిటీ పంపిన నోటీసుకు తాను ఇప్పటికే వివరణ ఇచ్చానని కొండా సురేఖ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక అంశంపై విచారణ కొనసాగుతున్న తరుణంలోనే, సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర నేతలు బహిరంగంగా విమర్శలు చేయడం సమంజసం కాదని, ఈ విషయాన్ని కమిటీ తీవ్రంగా పరిగణించాలని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. కాగా, ఈ లేఖ రాయడానికి ముందు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఈ అంశంపై స్పందించారు. కొండా సురేఖ సమర్పించిన వివరణపై కమిటీ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలను ఒక బాధ్యతాయుతమైన మంత్రిగా సురేఖ ఖండించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఆ వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ వాదిస్తున్నట్లు మల్లు రవి పేర్కొన్నారు. ఇదే సమయంలో, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోతో పాటు ఆయన ఇచ్చిన వివరణను కూడా పరిశీలించినట్లు వెల్లడించారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, దీనిని సుమోటోగా స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై యోచిస్తున్నామని ఆయన వివరించారు.

# గచ్చిబౌలిలో కూలిన భవనం.. ఇద్దరి దుర్మరణం

- గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో కూలిన నిర్మాణంలో ఉన్న భవనం
- ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు మృతి
- అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నట్లు గుర్తింపు
- క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులిచ్చారంటూ స్థానికుల ఆరోపణలు



హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో శనివారం విషాదం చోటుచేసుకుంది. అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన మోపత్, ఉమేష్‌గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. 'విక్టిమ్ లొకేషన్ సిస్టమ్' సహాయంతో శిథిలాల నుంచి రెండు మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించినట్లు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపారు. ప్రమాద సమయంలో భవనంలోకి ఇద్దరు కార్మికులు వెళ్లారని స్థానికులు చెప్పడంతో, శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేవలం 50 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ నిర్మాణంపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, భవన యజమాని ఖాజా క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులు చెల్లించి పనులు కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పైకి ఒరిగి కూలిపోవడంతో ఆ కట్టడం కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అక్రమ నిర్మాణంపై పొరుగున ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఓ ఐదంతస్తుల భవనం ఇలాగే ప్రమాదకరంగా ఒరిగిపోయిన ఉదంతాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

వార్త
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 23 ఆగష్టు 2026

# సంపాదకీయం

## కొత్త సీసాలో పక్వతలేని పాకం!



బండి నారాయణస్వామి రాసిన 'దళిత బహుజన వాదానికి కొత్త పిలుపు' అనే వ్యాసం దళిత బహుజనుల మతపరమైన అస్తిత్వాన్ని, సామాజిక న్యాయాన్ని ఒకేసారి కాపాడగల ప్రత్యామ్నాయంగా 'హిందూ దళిత బహుజనవాదం' అనే భావనను ప్రతిపాదిస్తోంది. అయితే, ఈ వ్యాసంలో అనేక తార్కిక లోపాలు, భావనాత్మక అస్పష్టతలు, చారిత్రక సరళీకరణలు, ఆధార రహిత సాధారణీకరణలు ఉన్నాయి. వ్యాసకర్త ఒకవైపు ఆరెస్సెస్--బీజేపీ భావజాలాన్ని, మరోవైపు నాస్తిక--మార్క్సిస్టు లౌకికవాదాన్ని ఉంచి, ఈ రెండు ధ్రువాల మధ్య హిందూ దళిత బహుజనులు చిక్కుకున్నారని వాదించారు. భారతదేశంలోని సామాజిక--రాజకీయ ఆలోచనా ప్రపంచం కేవలం ఈ రెండు ధ్రువాలకే పరిమితం కాలేదు. అంబేద్కరిజం, జ్యోతిరావు ఫూలే భావజాలం, పెరియార్ ఉద్యమం, బౌద్ధ దళిత ఉద్యమం, గాంధేయ సామాజిక సంస్కరణ, రాజ్యాంగవాదం, వివిధ సోషలిస్టు సంప్రదాయాలు వంటి అనేక ప్రత్యామ్నాయ భావజాలాలు కూడా ఉన్నాయి.

అదేవిధంగా, మొత్తం నాస్తికవాదాన్ని ఆయన చిత్రీకరించిన తీరు కూడా ఆధార రహిత సాధారణీకరణ. నాస్తికులు మతాన్ని అధ్యయనం చేయరన్న వాదనను సమర్థించే ఉదాహరణలు సైతం వ్యాసంలో లేవు. మతాన్ని విశ్లేషించిన ప్రముఖ సామాజిక సిద్ధాంతకర్తలూ లేకపోలేదు. ఉదాహరణకు, డి.డి. కోశాంబి, రొమిలా థాపర్, ఇర్ఫాన్ హబీబ్ వంటి అనేకమంది మతాన్ని లోతుగా అధ్యయనం చేశారు. మతాన్ని విమర్శించడం, మతాన్ని అధ్యయనం చేయకపోవడం రెండూ వేర్వేరు విషయాలు. అలాగే, 'మతం తెలియనివారికి సంస్కృతి తెలియదు' అనే వాదన సైతం తార్కికంగా నిలబడదు. సంస్కృతి అనేది కేవలం మతం కాదు. భాష, సాహిత్యం, కళలు, సంగీతం, జానపద సంప్రదాయాలు, చరిత్ర, వంటకాలు, కుటుంబ నిర్మాణం, సామాజిక సంబంధాలు, స్థానిక ఆచారాలు, జీవన విధానాలు... ఇవన్నీ కలిపే సంస్కృతి అవుతుంది. మతం సంస్కృతిలో ఒక భాగం; సంస్కృతి మొత్తాన్ని మతంతో సమానంగా చూడలేం. ఈ రెండింటిని ఒకే అర్థంలో చూడటం భావనాత్మక పొరపాటువ్యాసంలో ఆరెస్సెస్ పట్ల ఆయన తీసుకున్న వైఖరిలోనూ స్పష్టత లేదు. ఒకచోట దళిత బహుజనుల సామాజిక న్యాయాన్ని ఆరెస్సెస్ నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు, వెంటనే అదే సంస్థ దేశభక్తికి పునాదులు వేసిందని ప్రశంసిస్తారు, ఆ తర్వాత మళ్లీ.. అది హిందూ దళిత బహుజనులకు ప్రమాదమని చెబుతారు. ఇంతకూ ఏ అంశాన్ని అంగీకరిస్తున్నారు? ఏ అంశాన్ని తిరస్కరిస్తున్నారు? ఈ రెండింటి మధ్య గీత ఎక్కడ? అట్లాగే ఆరెస్సెస్ మధ్యయుగాల వారసత్వ వృత్తులను సమర్థిస్తోందన్న ఆరోపణ తీవ్రమైనది. ఈ ఆరోపణకు తగిన కారణాలు చూపకపోవడంతో అది నిర్ధారిత అంశంగా కాక కేవలం అభిప్రాయంగానే మిగిలిపోతుంది.

'హిందూ దళిత బహుజనుడు' అనే భావనను ప్రతిపాదించినప్పుడు కూడా బండి నారాయణస్వామి ఒక ముఖ్యమైన చారిత్రక ప్రశ్నను పక్కనపెట్టారు. హిందుత్వానికి భిన్నంగా హిందూ దళిత బహుజన అస్తిత్వం అవసరమని చెబుతున్నప్పటికీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎందుకు బౌద్ధమతాన్ని స్వీకరించారు? ఎందుకు లక్షలాది మంది దళితులు హిందూమతాన్ని విడిచారు? ఆయన ప్రతిపాదిస్తున్న ఈ కొత్త సిద్ధాంతం, అంబేద్కర్ చేపట్టిన హిందూమత విమర్శతో ఏకీభవిస్తుందా? విభేదిస్తుందా? లేక దాన్ని అధిగమించాలనుకుంటుందా? అనే ఏ ప్రశ్నకూ వ్యాసం సమాధానం ఇవ్వదు. ఇదే తరహా సాధారణీకరణ క్రిస్టియన్ మేధావుల విషయంలోనూ కనిపిస్తుంది. అలాగే, ముస్లింల రాజకీయ--సామాజిక ప్రతిస్పందనను కేవలం మతగ్రంథాలకు మాత్రమే ఆపాదించడం అతి సరళీకరణ .

"హిందూ మతాన్ని ప్రజాస్వామ్యీకరించాలి" అనే ప్రతిపాదన కూడా ఒక నినాదంగా మాత్రమే మిగిలిపోయింది. కానీ దాన్ని ఎలా సాధించాలి? ఆలయాల నిర్వహణలో మార్పులా? పూజారి వ్యవస్థలో సంస్కరణలా? వర్ణ వ్యవస్థ నిర్మూలనా? ఒకవైపు బ్రాహ్మణాధిపత్యాన్ని నిర్మాణాత్మక సమస్యగా పేర్కొంటూనే, మరోవైపు అదే వర్గం మతపరమైన వారసత్వాన్ని సంరక్షించిన పాత్రను ప్రశంసిస్తున్నప్పుడు ఈ రెండు మూల్యాంకనాలను ఏ ప్రమాణం ఆధారంగా సమన్వయిస్తున్నారో కూడా వివరించాలి.

వ్యాసంలో "దేశం ముందు మతం" అనే స్థానం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే ఇక్కడ కూడా "దేశం" అనే పదాన్ని ఏ అర్థంలో తీసుకున్నారో సరైన నిర్వచనం లేదు. దేశం అంటే రాజ్యమా? జాతియా? నాగరికతా? లేక రాజ్యాంగ ప్రజాస్వామ్యంలోని పౌరసమాజమా? అలాగే "హిందూ దళిత బహుజనవాదం" అనే భావన ఒక మతపరమైన ఉద్యమమా? రాజకీయ సిద్ధాంతమా? సామాజిక ఉద్యమమా? సాంస్కృతిక వేదికా? అంబేద్కరిజానికి విస్తరణా? హిందుత్వానికి ప్రత్యామ్నాయమా? అనే ప్రశ్నలకు వ్యాసం చివరివరకూ స్పష్టమైన సమాధానం ఇవ్వదు.

'హిందూ దళిత బహుజనవాదం' అనే భావనకు స్పష్టమైన నిర్వచనం, తార్కిక సమగ్రత, చారిత్రక ప్రాతిపదిక, ఆచరణాత్మక రూపకల్పన నారాయణస్వామి వ్యాసంలో కనిపించవు. అందువల్ల ఆయన వ్యాసం చర్చకు ఆహ్వానించే ప్రతిపాదనగా నిలిచినా, సిద్ధాంత నిర్మాణంగా మాత్రం నిలబడదు

# ప్రజాఫర్మానాకు ఫిరాయింపుల తూట్లు

ప్రజాస్వామ్యానికి మూలం ప్రజల తీర్పు. అంటే జనాదేశం. ప్రజల ప్రతినిధిగా స్థానిక సంస్థలకో, శాసనసభకో, పార్లమెంటుకో ఎన్నికయ్యేవారు ఈ జనాదేశాన్ని అనుసరించి నడుచుకోవాలి. అందుచేత పార్టీ ఫిరాయించడమనేది ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ఉల్లంఘించడమే. అధికారం చేజిక్కించుకోవడానికి ఫిరాయింపులను ఆశ్రయించడం, మూడింట రెండొంతుల బలంతో చీలికలు తెచ్చి పబ్బం గడుపుకోవడం.. ఫిరాయింపుల నిరోధక చట్టం ఆశయాన్ని నీరుగారుస్తున్నవి. ఫిరాయింపుల చట్టానికి ఎన్ని సవరణలు చేసినా ఈ రాజకీయ అవినీతి బుల్డోజర్‌ను అడ్డుకోలేకపోతున్నాయి. కేంద్ర పాలకపక్షం స్వహస్తాలతో ఈ ఘాతుకానికి పాల్పడుతుండడాన్ని చూసి ప్రజాస్వామ్యం ముక్కున వేలేసుకుంటున్నది. తగిన మెజారిటీ లేక ఇటీవల వీగిపోయిన డీలిమిటేషన్, చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ సంయుక్త రాజ్యాంగ సవరణ బిల్లు స్థానంలో మళ్లీ అదే బిల్లును ప్రవేశపెట్టి ఈసారి నెగ్గించుకోవడానికి కేంద్రంలోని ఎన్డీఏ పాలకులు తృణమూల్ కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్)లో చీలికలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనివల్ల లోక్‌సభలో ఎన్డీఏ బలం పెరిగింది. కానీ రాజ్యాంగ సవరణ బిల్లు నెగ్గడానికి అవసరమైనంతగా అది పెరగలేదు. అయినా ప్రలోభాల ఎరవేసి ప్రతిపక్షంలో చీలికలు తేవడంలో తమకున్న నేర్పు మీద భరోసాతో ఎన్డీఏ పాలకులు ఈ రాజ్యాంగ సవరణ బిల్లును మరోసారి ముందుకు తోయాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తున్నది.

లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం స్థానాల రిజర్వేషన్‌ను అమల్లోకి తేవడం కోసం 'నారీశక్తి వందన్ అధినియం' పేరిట 2023లో 106వ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చారు. అయితే 2027 తర్వాత జరిగే నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణతో దీనిని ముడిపెట్టారు. ఇందువల్ల చట్టసభల్లో మహిళల కోటా దాదాపు 2034 వరకు అమలుకు నోచుకోని పరిస్థితి తలెత్తింది. ఇప్పుడు తమ రాజకీయ అవసరాల కోసం 2011 జనగణన ప్రాతిపదికగా డీలిమిటేషన్(నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ) చేపట్టి లోక్‌సభ నియోజకవర్గాలను సగం పెంచాలని, అదే పనిగా మహిళలకు చట్టసభల్లో 33శాతం కోటాను అమల్లోకి తేవాలని సంకల్పించి సంయుక్త రాజ్యాంగ సవరణ బిల్లును ఉద్దేశించారు. చట్టసభల బలాన్ని పెంచడం కోసం జరపవలసిన సీట్ల పెంపు వ్యవహారం చుట్టూ అత్యంత వివాదం అల్లుకున్న సంగతి తెలిసిందే.



ఆయా రాష్ట్రాల జనాభా ప్రకారం జరగవలసిన ఈ ప్రక్రియ వల్ల కుటుంబ నియంత్రణను కచ్చితంగా పాటించి జనాభా పెరుగుదలను పరిమితం చేసుకొని, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలు ఈ పెంపులో తక్కువ సీట్లు పొందుతాయి. మరోపక్క జనాభా నియంత్రణలో, అభివృద్ధిలో బాగా వెనుకబడి ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ స్థానాలు లభిస్తాయి. ఫలితంగా దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. అందుచేత జనాభా ప్రాతిపదికగా సీట్ల పెంపును దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. అన్ని రాష్ట్రాలలో నియోజకవర్గాలను 50శాతం పెంచే చిట్కాను అమల్లోకి తెచ్చి ఈ వివాదం నుంచి బయటపడాలని కేంద్రంలోని ఎన్డీఏ పాలకులు ఆశిస్తున్నారు. మహిళల రిజర్వేషన్లను ముందుకు జరిపించి డీలిమిటేషన్‌కు జత చేయడం ద్వారా ప్రతిపక్షాన్ని కట్టడి చేయాలన్న ఉపాయాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తే మహిళా వ్యతిరేకులుగా ముద్ర పడుతుందని విపక్షాలు భయపడతాయని పాలకపక్షం ఈ ఎత్తు వేసింది. విడిగా మహిళల రిజర్వేషన్ చట్టాన్ని అమలులోకి తెస్తే తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేస్తూ సమైక్య ప్రతిపక్షం సంయుక్త రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించిన అపూర్వ అమోఘ సన్నివేశాన్ని గత ఏప్రిల్ 17న పార్లమెంట్‌లో చూడగలిగాం. ప్రతిపక్షం అపూర్వమైన ఐక్యతను ప్రదర్శించింది. ఇది ప్రధాని మోదీని అమితంగా కలచివేసిందని అంటున్నారు. అందుచేత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును మళ్లీ తెచ్చి నెగ్గించుకోవాలని చూస్తున్నారు. ఇందుకోసమే అటు తృణమూల్ కాంగ్రెస్, ఇటు శివసేనలో చీలికలు తీసుకొచ్చారు. దీనివల్ల లోక్‌సభలో ఎన్డీఏ బలం 25 స్థానాలు పెరిగి 313కి చేరింది. అయినప్పటికీ రాజ్యాంగ సవరణకు కావలసిన మూడింట రెండొంతులకు (362) ఇంకా తక్కువే. కాబట్టి ప్రతిపక్షాలను మరిన్ని ప్రలోభాలతో మరింతగా చీల్చి బిల్లును నెగ్గించుకోవడానికి ఎన్డీఏ పాలకులు వెనుకాడకపోవచ్చు. ఇది ప్రతిపక్ష ఐక్యతకు పెను సవాలే!

పాలకపక్షం అధికారం అండతో తెచ్చే ఇటువంటి చీలికలు ప్రజాస్వామ్య పునాది అయిన జనాదేశానికి తూట్లు పొడిచి ప్రజాప్రాతినిధ్య పరమార్థానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. అందుచేత ఎన్నికల్లో ఏ పార్టీ ద్వారా నెగ్గారో అదే పార్టీలో చివరివరకూ కొనసాగవలసిన విధ్యుక్త ధర్మాన్ని విధిగా పాటించేలా తగిన చట్టాన్ని తీసుకురావాలి.

# ఇంధన పంటలకు ఇదే తరుణం!

వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో అమ్మే అన్ని మోటారు వాహనాలూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ మాత్రమే కావాలి. ఒక దశాబ్దకాలంలో మనం దశలవారీగా డీజిల్, పెట్రోల్ వాహనాలను తొలగిస్తూ, వందశాతం ఈవీలకు మళ్లగలిగితే.. మనకు ఏడాదికి 25 కోట్ల టన్నుల భారీ స్థాయి ముడిచమురు అవసరం ఉండదు. బొగ్గు, చమురుపై ఆధారపడటం మానవాళి చరిత్రలో స్వల్పకాలిక దశ మాత్రమే. చివరికి మనకి బొగ్గు, చమురు, గ్యాస్ వనరులు ఖాళీ అవుతాయి. సౌరశక్తిని, జీవపదార్థాన్ని (బయోమాస్) ప్రత్యా ఒమ్నాయ ఇంధనంగా మార్చటం మీదే భవిష్యత్తు ఆధారపడి ఉంది. సౌర విద్యుదుత్పత్తి, స్టోరేజీ బ్యాటరీల ద్వారా ఇప్పుడు మనం ఆ ఇంధన స్వప్నానికిమునుపెన్నడూ లేనంత చేరువలోకి వచ్చాం. జీవ పదార్థాన్ని వినియోగ ఇంధనంగా సమం్థవంతంగా మార్చుకోవటానికి కొత్త సాంకేతికతలు ఇప్పుడు మనకో అవకాశాన్నిస్తున్నాయి.

మన వ్యవసాయ సాగుభూమి 170--180 మిలియన్ హెక్టార్లు. మొత్తం ప్రపంచ సాగునేలలో ఇది సుమారు 11శాతం. ఏడాది పొడవునా పంటలకు అనుకూలంగా ఉండేలా పుష్కలమైన సూర్యరశ్మి, ఉష్ణోగ్రతలు మనకున్నాయి. మన రుతుప వనాలు కావలసినంత వర్షపాతాన్ని అందిస్తాయి. మన భూములు సారవంతమైనవి. 1950లో భారత్ సుమారు 5.2 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధా న్యాలను మాత్రమే ఉత్పత్తి చేసింది. దీనివల్ల మనం దిగుమతులపై భారీగా ఆధారపడ్డాం. అలాంటిది, ఇప్పుడు మనకు భారీ మిగులు ఉంది. 2024--25లో రికార్డు స్థాయిలో 35.8 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేశాం. దిగుబడుల సమయంలో, మన ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) 8 కోట్ల మెట్రిక్ టన్నుల వరకు గోదాములలో నిల్వ చేస్తోంది. ప్రస్తుతం మన ధాన్యం గిడ్డంగులలో 6 కోట్ల మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి. ఆహారధాన్యాలను ఇలా మనం పెద్దఎత్తున ఉత్పత్తి చేస్తున్నా, వినియోగంలో సమాజం పోకడలు మాత్రం మారిపోయాయి. ప్రజల ఆహారపు అలవాట్లు మారటం, వైవిధ్యభరితం కావటంతో బియ్యం, గోధుమల తలసరి వినియోగం తగ్గిపోయింది. దీంతో మార్కెట్‌లో వాటికి డిమాండ్ పరిమితమైంది. అయినా కూడా ఎప్పుడో కొరతల కాలంలో ప్రవేశపెట్టిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూపంలో మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి ప్రభుత్వం బలవంతంగా ధాన్యం కొనాల్సి వస్తోంది. వాటిని ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లోకి ఇబ్బడిముబ్బడిగా సరఫరా చేస్తోంది. పీడీఎస్‌కి సరఫరా చేసిన ఆహార ధాన్యాలలో సుమారు 40 శాతాన్ని లబ్ధిదారులు మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. రీసైక్లింగ్‌తో ఇవి చాలా సందర్భాలలో తిరిగి ఎఫ్‌సీఐకి చేరుతున్నాయి. మరో వంక, ఎంఎస్‌పీ పేరుతో అర్థరహిత ప్రోత్సాహకం ఇస్తుండటంతో రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు మళ్లటానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఇంధన పంటల పెంపకానికి సరైన రీతిలో రూప కల్పన చేసి అమల్లోకి తెస్తే, అన్ని సమస్యలనూ ఒక్కసారిగా పరిష్కరించగలదు. రైతులకు ఆదాయం పెరగటం, ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గించటం, గ్రామీణ పారిశ్రామికీకరణను ప్రోత్సహించటం, ఇంధన భద్రత కల్పించటం, చమురు, గ్యాస్ దిగుమ తులను తగ్గించటం, పర్యావరణాన్ని పరిరక్షించటం.. ఇవన్నీ ఆ ఒక్క మార్పుతో సాధ్యమవుతాయి. ఉదాహరణకు, హైబ్రిడ్ సూపర్ నేపియర్ గ్రాస్‌ను నీటి వనరులున్న వరి సాగు భూముల్లో పండించటం. ఆ గడ్డి పెంపకానికి ఆ తరహా భూములు అనువైనవి. దీనివల్ల, రైతులు ఎకరాకు ఏడాదికి సుమారు 160 మెట్రిక్ టన్నుల తాజా గడ్డిని పండించగలరు. దీన్నుంచి 8 టన్నుల కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)ను ఉత్పత్తి చేయవచ్చు. ఇది ఎల్‌పీజీ (వంటగ్యాస్) కి ప్రత్యా మ్నాయం. అంతేకాదు, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం (బయోచార్), జీవ ఇంధన ఎరువు వంటివి ఉత్పత్తి చేసి అమ్ముకోవచ్చు. ఈ రకంగా రైతులు ఎకరాకు రూ.80,000 నుంచి 1,00,000 నికర ఆదాయాన్ని ఆర్జించవచ్చు. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించనవసరం లేదు. రైతులకు గ్యారంటీగా, స్థిరంగా మంచి ధర లభించేలా భరోసాకు చర్యలు తీసుకుంటే చాలు (ఉదాహరణకు, తాజా నేపియర్ గడ్డి ఎం.టికి రూ.700--800, ఎండు రకానికి టన్నుకు రూ.3,000 వరకు). కాంట్రాక్ట్ వ్యవసాయ పద్ధతిలో ముడిసరుకు లభ్యతకు ఢోకా లేకుండా సీబీజీ పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వా నించాలి. ప్రభుత్వం ఇప్పటికే అటువంటి పరిశ్ర మలకు పెట్టుబడి వ్యయ (క్యాపెక్స్) రాయితీలు, సీబీజీ కొనుగోలుకు హామీ ఇవ్వటం వంటి రూపాల్లో ప్రోత్సాహకాలను ఇస్తోంది. మనం చేయవలసిందల్లా ఈ ప్రక్రియను విస్తృత స్థాయికి విస్తరించటం. కాంట్రాక్ట్ వ్యవసాయం, ఉత్పత్తుల సేకరణకు విధివిధానాలను రూపొందించటం, ముడిసరుకును పరిశ్రమలకు అంతరాయం లేకుండా సరఫరా చేయ టం, రైతులకు న్యాయమైన ధర వచ్చేట్లు భరోసా ఇవ్వటం. ఈపాటి ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చేస్తే, పదుల లక్షల ఎకరాల పల్లపు భూమిలో వరి లాంటి పంటలకు బదులు ఇంధనాన్ని ఉత్పత్తి చేయవచ్చు.

మనం భారత్‌లో 11.5 కోట్ల ఎకరాలలో వరి పండిస్తున్నాం. ఇందులో రెండు శాతం-- సుమారు 25 లక్షల ఎకరాల భూమిని గనక నేపియర్ గ్రాస్ సాగుకు పూర్తిస్థాయిలో మళ్లించగలిగి, దాన్ని కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)గా మార్చగలిగితే సూర్య రశ్మి



పుష్కలంగా ఉన్న మన భూముల్లో 2 కోట్ల టన్నుల సీబీజీని ఏటా ఉత్పత్తి చేయగలం. భారతదేశానికి వంటగ్యాస్ దిగుమతి అవసరం ఉండదు. ప్రస్తుత ధరల ప్రకారం-- సుమారు రూ.1,50,000 కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకోగలం. భూమి ఉత్పాదకత పెరిగినకొద్దీ, మనం ఇంధన పంటల్ని ఎక్కువ ప్రాంతాలకు విస్తరిం చవచ్చు. ఆహార భద్రతకు ఢోకా లేకుండానే ఇవన్నీ చేయవచ్చు.

అదే విధంగా, భారత్‌లో 21 కోట్ల ఎకరాల అటవీ భూమి ఉంది. మన వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన ఇంధన చెట్లను అడవుల్లో పెంచవచ్చు. ఉదాహరణకు, పాప్లర్(కాటన్ వుడ్), విల్లో(కొండ గన్నేరు), యూకలిప్టస్ (నీలగిరి), సరుగుడు, గుమ్మడి టేకు(గహర్), మాంగియం (మక్కం), సుబాబుల్ తదితరాలు. ఒక ఎకరం అటవీ భూమిలో ఏటా ఎకరాకు 5 టన్నుల జీవ పదార్థాన్ని (బయోమాస్) సాధారణంగా ఉత్పత్తి చేయవచ్చు. జీవ పదార్థాన్ని ఇంధనంగా పూర్తిస్థాయిలో మార్చటానికి ఇప్పుడు సాంకేతికతలు(పైరోలిసిస్, ఎంజైమ్‌లు) అందుబాటులో ఉన్నాయి. అటవీ భూమిలో సుమారు 10శాతం గనక ఇంధన వృక్షాల పెంపకానికి కేటాయి ంచగలిగితే బయోఇథనాల్, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం లేదా సుమారు 2.5 కోట్ల టన్నుల దిగుమతి నూనెకు సమానమైన విలువగల రసాయనాల్ని మనం ఉత్పత్తి చేయగలం.

మన భూ విస్తీర్ణం, సారవంత నేలలు, ఉష్ణమండల వాతావరణం, ప్రస్తుత సాంకేతికత, విస్తృత స్థాయి వల్ల సగటు వ్యయం తగ్గటం... ఇవన్నీ మనం హైడ్రోకార్బన్ల దిగుమతి మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా చేస్తున్నాయి. మన ఆర్థిక వ్యవస్థను విముక్తం చేసే అద్భుతావకాశాన్నిస్తున్నాయి. ఒక కీలక విధాన నిర్ణయం అమలు 'ఇన్ని రకాల లాభాలను సమాజానికి అందించటం' అరుదుగా మాత్రమే జరుగుతుంది. మనం ఈ అవకాశాన్ని తక్షణం అందిపుచ్చుకోవాలి.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# చిప్పగిరిలో ముగిసిన తి.తి.దే. ధార్మిక కార్యక్రమాలు





**కర్నూలు ఆగస్టు 22 వార్త సాక్ష్యం**

తిరుమల తిరుపతి దేవస్థానశీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన చిప్పగిరిలో వెలసిన శ్రీ గోవిందప్ప స్వామి దేవస్థానం నందు గత ఐదు రోజులుగా జరుగుచున్న ధార్మిక కార్యక్రమాలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ప్రతి రోజు స్మాత్మానంద స్వామిచే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం గోపూజ మరియు సామూహిక కుంకుమార్చనలు, బళ్ళారి దత్తపీఠం జె. శాంతమ్మ ఆధ్వర్యంలో భగవద్గీత గోల్డెమెడలిస్ట్ పి. నీరజాక్షి, వై. రజనీ, పి. ఆదిలక్ష్మి బృందంచే భగవద్గీత పారాయణం భక్తిపారవశ్యం కలిగించాయి. సమాజంలో భక్తిచింతన కలిగించుటకు ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు నాగనా ధనహళ్ళి రాఘవాచార్, ఎల్. రామచంద్ర, పి. గురుప్రసాద్, పి.వి.యం. చెన్నవీరయ్యస్వామి, యం. లక్ష్మీ నారాయణ, యస్. లోకేశ్, పి. షణ్ముఖ తోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.




# స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర సాధనకు అందరూ సహకరించాలి





**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల, ఆగస్టు, 22 వార్త సాక్ష్యం**

స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం ద్వారా స్వర్ణాంధ్ర సాధనకు ప్రజలందరూ సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా శ్రమించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ, రామునాయక్ కలెక్టరేట్ ఎఓ సుభాకర్ రావు, డిఎస్ఓ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలన్నారు. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణకు గాను ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ రోజువారీ అవసరాల కోసం ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్ బ్యాగులు ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేదించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పొందాలన్నారు. ఈ విషయంలో ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమని, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా జిల్లా పరిశుభ్రంగా ఉంటుందన్నారు. అనంతరం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ విస్తృతంగా శ్రమదానం కార్యక్రమం నిర్వహించి పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించారు. అదే విధంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.



# తెలుగుగంగ జలాల కోసం రైతుల ఆందోళన...!

**-ప్రభుత్వం వెంటనే స్పందించాలి**

**-శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి**

**వెలుగోడు ఆగస్టు 22 వార్త సాక్ష్యం**

ప్రభుత్వం స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకోకుంటే ఈనెల ఆఖరులోగా 500 ట్రాక్టర్లతో రైతులను తరలించి వెలుగోడు డ్యామ్‌ను ముట్టడిస్తామని శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి హెచ్చరించారు.ఈ నేపథ్యంలో శిల్పా చక్రపాణి రెడ్డి బండిఆత్మకూరు మండలం జీ.లింగాపురం గ్రామంలో పర్యటించి రైతులతో సమావేశమయ్యారు.గ్రామంలోని రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని, సాగునీరు అందక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, శ్రీశైలం ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ తెలుగుగంగ ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి తెలుగుగంగ కాలువలకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తెలుగుగంగ జలాల సాధన కోసం రైతులతో కలిసి పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు,మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# పచ్చదనం.. పరిశుభ్రతతో ప్రగతి

**కర్లపాలెంఆగస్టు 22 వార్త సాక్ష్యం**

పచ్చని చెట్లు పెంచుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌తో పాటు స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కర్లపాలెం ప్రత్యేక అధికారి ఆర్. ఘననాథ్ పిలుపునిచ్చారు. కర్లపాలెం స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలో స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి ఆర్. ఘననాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లను విరివిగా పెంచడం, పరిశుభ్రతను పాటించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. ఇళ్లు, పాఠశాలలు, రహదారులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుభిక్షమైన, ఆనందకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, తడి--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. అనంతరం రహదారి పక్కన మొక్కలు నాటి, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతపై అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఓపీఆర్డీ అయినంపూడి శ్రీనివాసరావు, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. విజయశ్రీ, ఉపాధ్యాయులు ఇనకొల్లు పోలీసురావు, సుబ్బారెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



## కర్లపాలెంలో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



**కర్లపాలెం ఆగస్టు 22 వార్త సాక్ష్యం**

బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం ఐలాండ్ సెంటర్‌లో మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పద్మ విభూషణ్, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మెగా అభిమానులు చిరంజీవి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించి, అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ సభ్యులు మనలి చైతన్య, జనసేన పార్టీ లీగల్ సెల్ సభ్యురాలు, బాపట్ల ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యురాలు జిడుగు విజయ మాధురి, పిట్లవానిపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షులు హుస్సేన్ బేగ్, కర్లపాలెం మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు చిలకల సురేంద్ర, వీర మహిళ ఆగిశెట్టి నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.అలాగే మెగా కుటుంబ వీరాభిమానులు ఆకుల నారాయణ, ఆగిశెట్టి శ్రీకాంత్, జిడుగు రాజేష్, గాజులు శ్రీనివాసరావు, చల్లపల్లి ఏసోబు, మనలి రవికిషోర్‌తో పాటు మెగా కుటుంబ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందబాబు



**భట్టిప్రోలు ఆగస్టు 22 వార్త సాక్ష్యం**

భట్టిప్రోలు మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండప కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఆధునీకరించిన సెంట్రల్ ఏసీ కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు హాజరై కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండపం నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, కళ్యాణ మండప కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ చొరవతో గ్యాస్ బుకింగ్ సులభతరం

**బాపట్ల ఆగస్టు 22 వార్త సాక్ష్యం**



హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు సిలిండర్ బుకింగ్‌కు 45 రోజుల నిరీక్షణతో ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఇకపై బాపట్ల పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ వినియో గదారులు 25 రోజులకే సాధారణ పద్ధతిలో సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. గ్యాస్ బుకింగ్‌కు 45 రోజుల వ్యవధి విధించడంతో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట ప్రత్యేక చొరవ చూపారు. వినియోగదారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు విజయవాడ, బాంబేలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారానికి నిరంతరం ప్రయత్ని ంచారు. జిల్లా సివిల్ సప్లై అధికారి ఏ. జగన్మోహన్ రావు ప్రత్యేక చొరవతో పాటు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమన్వయంతో జరిపిన ప్రయత్నాలు ఫలించాయి. దీంతో ఇకపై బాపట్ల పట్టణ హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులకు 25 రోజులకే బుకింగ్ అవకాశం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు. గ్యాస్ బుకింగ్ విషయంలో వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు వినియోగదారులు కృతజ్ఞతలు తెలిపారు. తాజా నిర్ణయంతో బాపట్ల పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులకు ఊరట లభించనుంది.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

## స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యం

-పట్టణ అధ్యక్షుడు ఆంద్రేయ



బాపట్లఆగస్టు 22 వార్త సాక్ష్యం

బాపట్ల పట్టణంలోని 10వ వార్డు ప్యాడిసన్‌పేటలో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర (SASA) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, బాపట్ల పురపాలక సంఘ ప్రత్యేకాధికారి ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సూచనలతో, కమిషనర్ ఎం. హాసిని ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి ఆంద్రెయ పాల్గొని స్వచ్ఛత కార్యక్రమానికి మద్దతు తెలిపారు. అనంతరం వార్డులోని ప్రధాన రహదారులు, డ్రైనేజీలను మునిసిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మునిసిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు.అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్యం, పచ్చదనం, పరిశుభ్రమైన పరిసరాలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని మేనేజర్ మూకిరి చంద్ర మోహన్ తెలిపారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మందపాటి ఆంద్రెయ మాట్లాడుతూ, స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన బాపట్లను నిర్మించగలమన్నారు. అనంతరం మేనేజర్ ఆధ్వర్యంలో పాల్గొన్న వారందరితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేవూరి కరుణ, సయ్యద్ నజీర్, పురపాలక, సచివాలయ సిబ్బంది, మెప్మా ఆర్‌పీలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు. 10వ వార్డును పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు.

## నేరస్తుల కదలికల పై పోలీసుల నిఘా



సత్తెనపల్లి ఆగస్టు 22 వార్త సాక్ష్యం

సత్తెనపల్లి పట్టణంలోని రంగా కాలనీలో పోలీసులు తెల్లవారుజాము నుంచి విస్తృతంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో నలుగురు సీఐలు, తొమ్మిది మంది ఎస్‌ఐలు, 90 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు నేర కార్యకలాపాలను అరికట్టడమే కార్డన్ సెర్చ్ ప్రధాన ఉద్దేశమని డీఎస్పీ కృష్ణ చైతన్య తెలిపారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు నిరంతరం తనిఖీలు, నిఘా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.ఒకటి కంటే ఎక్కువ కేసులు ఉన్న రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ప్రజలకు భద్రతపై భరోసా కల్పించడం, నేరాలకు పాల్పడే వారిని ముందుగానే గుర్తించి నియంత్రించడం, ప్రజల్లో చట్టంపై అవగాహన పెంచడం కూడా కార్డన్ సెర్చ్ లక్ష్యాల్లో భాగమన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎక్కడైనా గొడవలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 110కు డయల్ చేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చట్టవిరుద్ధంగా గొడవలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.కార్డన్ సెర్చ్ ద్వారా నేరస్తులపై పోలీసుల నిఘా మరింత పటిష్టమవుతుందని, గంజాయి, డ్రగ్స్ సహా ఇతర నేర కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

## పర్యావరణ హిత వినాయక చవితి వేడుకలకు నంద్యాల జిల్లా యంత్రాంగం పిలుపు






-ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలపై నిషేధం ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ

-జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా

నంద్యాల, ఆగస్టు 22 వార్త సాక్ష్యం

నంద్యాల కలెక్టరేట్‌లో వినాయక చవితి పండుగ సమన్వయ కమిటీ ఉన్నత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా అధ్యక్షతనంలో జరిగిన సమావేశానికి జిల్లా వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ, పర్యావరణ హితంగా పండుగను నిర్వహించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (POP) మరియు రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాల ప్రతిష్ఠాపనను పూర్తిగా నిషేధిస్తూ, వాటి స్థానంలో కేవలం ప్రకృతి సిద్ధమైన, పర్యావరణ హిత మట్టి విగ్రహాలనే ఉపయోగించాలని జిల్లా యంత్రాంగం ఆదేశించింది.ఈ సమన్వయ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ శాఖ, పర్యావరణ అధికారులు చురుగ్గా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్, ఐ.పీ.ఎస్., జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్, బి.ఏ., అడిషనల్ ఎస్పీ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పి.వి. కిషోర్ రెడ్డి, ఆర్డీఓలుజిల్లా స్థాయి అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రామకృష్ణారెడ్డి, ప్రముఖ సభ్యుల ప్రాతినిధ్యంలోని వినాయక ఉత్సవ కమిటీలతో అధికారులు సుదీర్ఘంగా చర్చించి, సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. ప్రజలలో విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశంతో, ఈ సమావేశంలో అధికారులు ప్రత్యేక పోస్టర్లు, పామ్ ప్లేట్లను ఆవిష్కరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయన రంగుల విగ్రహాలను ఎందుకు వాడకూ డదో వివరించడంతో పాటు, కేవలం పర్యావరణ అనుకూల మట్టి విగ్రహాలనే ఉపయోగి ంచాలనే సందేశాన్ని ఇందులో పొందుపరిచారు. అంతేకా కుండా, పండుగ నిర్వహణలో ప్రజలు, ఉత్సవ కమిటీలు పాటించవలసిన చేయవలసిన పనులు చేయకూడని పనుల జాబితాను కూడా ఈ ప్రచార సామాగ్రి ద్వారా విడుదల చేశారు.ఈ పర్యావరణ మార్పునకు ప్రజల నుండి పూర్తి మద్దతు కూడగట్టేందుకు ప్రజలకు సహాయంగా ఉండేం దుకు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో పర్యావరణ హిత మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టను న్నారు. పండుగకు ముందు రోజు, 13.09.2026 (ఆదివారం) నాడు నంద్యాల జిల్లా కేంద్రంలో (డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్) ఈ మట్టి విగ్రహాల పంపిణీ కేంద్రం ఏర్పాటు కానుంది. ప్రజలందరికీ సహజసిద్ధమైన మట్టి విగ్రహాలు సులభంగా అందుబాటులో ఉండేలా చూడటమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. సమావేశంలో అధికారులు మాట్లాడుతూ, జలవ నరుల పరిరక్షణ,ప్రజల ఆరోగ్యం కాపాడటమే తమ ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మరియు రసాయనిక రంగుల వల్ల విగ్రహాల నిమజ్జనం సమయంలో స్థానిక నదులు, చెరువులు తీవ్రంగా కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మరియు జిల్లా బృందాలు విగ్రహాల తయారీ, విక్రయ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తాయని తెలిపారు. ఉత్సవ కమిటీలకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేస్తూనే, పర్యావరణ నిబంధనలను అమలు చేసేలా రెవెన్యూ మరియు పోలీస్ శాఖలు కలిసి పనిచేస్తాయని పేర్కొన్నారు."ప్రజలందరూ, ఉత్సవ నిర్వాహకులు మన సాంప్రదాయ పద్ధతులను పాటిస్తూ పర్యావరణ హిత మట్టి విగ్రహాలనే ఎంచుకోవాలని కోరుతున్నాము. ప్రతి ఒక్కరూ ఈ మార్పునకు శ్రీకారం చుట్టేలా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న జిల్లా కేంద్రంలో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణాన్ని కూడా కాపాడు కుంటూ ఈ వినాయక చవితిని జరుపు కుందాం," అని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ రాజకు మారి గన్నియా, ఐ.ఏ.ఎస్. పిలుపు నిచ్చారు. రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని వినాయక ఉత్సవ కమిటీలు జిల్లా యంత్రాంగం నిర్ణయానికి పూర్తి సంఘీభావం ప్రకటించాయి. స్థానిక ప్రాంతాలలో మరియు పందళ్లలో మట్టి విగ్రహాల వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ ఏడాది వినాయక చవితిని పరిశుభ్రమైన, పచ్చని మరియు పర్యావరణ అనుకూల పండుగగా మార్చడానికి ప్రజలు, నివాసితుల సంక్షేమ సంఘాలు, యువజన సంఘాలు సెప్టెంబర్ 13న ఏర్పాటు చేసే పంపిణీ శిబిరాన్ని సద్వినియోగం జిల్లా అధికార యంత్రాంగానికి కలెక్టర్ తెలియజేశారు.

## యువత పూలే--అంబేద్కర్ సిద్ధాంతాలను చదవాలి

-సమాజంలో ఉన్న రుగ్మతలపై ,సామాజిక చైతన్యంలో కీలక పాత్రపోయించిన నిజమైన హీరోలు

-యువతకు - విద్యార్థులకు న్యాయవాది కోడి మోహన్ రావు సూచన





దోర్నాల ఆగస్టు 22 వార్త సాక్ష్యం

యువతలో సామాజిక చైతన్యం పెరగాలంటే మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని న్యాయవాది కోడి మోహన్ రావు యువతకు పిలుపునిచ్చారు. సమాజంలో నెలకొన్న అసమా నతలు, కుల వివక్ష, అంటరానితనం, అజ్ఞానం, పేదరికం వంటి సమస్యలకు వ్యతిరేకంగా పూలే, అంబేద్కర్‌లు జీవితాంతం పోరాడారని వారు గుర్తుచేశారు. విద్య, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని వారు చూపించిన మార్గం నేటి యువతకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. "చదువు, ఆలోచించు, ప్రశ్నించు, సమాజ మార్పు కోసం పనిచేయి" అనే చైతన్యాన్ని యువతలో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పూలే విద్యను సామాజిక విముక్తికి ఆయుధంగా భావించగా, అంబేద్కర్ విద్యతో పాటు రాజ్యాంగ విలువలు, హక్కులు, ప్రజాస్వామ్యం, సమానత్వం కోసం పోరాడారని తెలిపారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో యువత కేవలం వినోదానికి పరిమితం కాకుండా పూలే, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు, రాజ్యాంగ విలువలను చదివి అవగాహన పెంచుకోవాలని సూచించారు. యువ తలో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, మానవతా విలువలు పెంపొందితేనే కుల, మత, ప్రాంత, ఆర్థిక వివక్షలకు అతీతంగా సమానత్వ సమాజాన్ని నిర్మించగలమని వారు అన్నారు. దేశభవిష్యత్ యువ తతోనే సాధ్యం అవుతుందని న్యాయవాది కోడి మోహన్ రావు తెలియజేశారు. భారత రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి సమాజం, చట్టాలు తెలుసుకొని చెడు వ్యాసనాలకు లోనై జీవితాలను పాడుచేసు కోవద్దని తల్లి దండ్రులకు సమాజం లో మంచిపేరు తీసుకొని రావాలని యువతకు సూచించారు. పూలే--అంబేద్కర్ ఆలో చనలు కేవలం ఒక వర్గానికి సంబంధించినవి కావని, సమాజంలోని ప్రతి మనిషి గౌరవంగా జీవించేందుకు మార్గం చూపే సామాజిక, ప్రజాస్వామ్య విలువలని యువత గుర్తించాలని సామాజిక శ్రేయోస్సుకు తోడ్పడాలని న్యాయవాది కోడి మోహన్ రావు యువతకు పిలుపునిచ్చారు.

## స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పారిశుధ్య సేవలు

చీరాల ఆగస్టు 22 వార్త సాక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీరాల పట్టణంలోని చిన్నపిల్లల పార్కులో శనివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ముఖ్య అతిథిగా పాల్గొని స్వయంగా చీపురు పట్టి పార్కులో పారిశుధ్య పనులు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛమైన వాతావరణం ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించడంతో పాటు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. పారిశుధ్య సిబ్బందితో పాటు ప్రజలు కూడా స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డీవో నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసెఫ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పార్కు పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రతపై ప్రజలకు



అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే స్వయ ంగా పారిశుధ్య పనుల్లో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఆత్మకూరులో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు





ఆత్మకూరు ఆగస్టు 22 వార్త సాక్ష్యం

తెలుగు సినీ యవనికపై తన అసమాన నటనతో కోట్లాది మంది అభిమానుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మెగాస్టార్ చిరంజీవి గారి 71వ జన్మదిన వేడుకలను ఆత్మకూరులో అభిమానులు అత్యంత వేడుకగా నిర్వహించారు. కేవలం వెండితెరపైనే కాకుండా రక్తదానం, నేత్రదానం, ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడిగా నిలిచి సమాజ సేవలో ఆదర్శంగా నిలిచిన తన నాయకుడి సేవా స్ఫూర్తిని చాటుతూ అభిమానులు పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. మెగా యూత్ ఫోర్స్ జాయింట్ కన్వీనర్ తమ్మినేని అమర్నాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆత్మకూరులో ఒక నవ వధువుకు పసుపు, కుంకుమ, మంగళ ద్రవ్యాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆత్మకూరు మండలం అమలాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్టేషనరీ బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... చిరంజీవి గారు మాకు కేవలం ఒక హీరో మాత్రమే కాదు, కోట్లాది మందికి జీవిత పాఠాలు నేర్పిన మార్గదర్శి. ఆయన చూపిన సేవా మార్గంలో నడవడం మాకు ఎంతో గర్వకారణం. విద్యార్థులను ప్రోత్సహించడం, పర్యావరణాన్ని కాపాడటం ద్వారా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మా లక్ష్యం అని అభిమానులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సేవా కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఉమ్మడి ప్రచార కార్యదర్శి కర్నాటి రాములు, మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ మారెడ్డి రామయ్య, జాయింట్ కన్వీనర్ వెంకట శివ, కో-కన్వీనర్ పురం హరీశ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వీరభద్రుడు, జనసేన నాయకులు గుంజ నాగరాజు, రాజశేఖర్, శ్యామ్, ఖాజా హుస్సేన్, మంగన్న, మహేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆశా వర్కర్ల పనిభారం తగ్గించాలి



బాపట్ల ఆగస్టు 22 వార్త సాక్ష్యం

ఆశా కార్యకర్తలపై పెరుగుతున్న అదనపు పనిభారాన్ని తగ్గించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. బాబూరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం బాపట్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) ఎస్. విజయమ్మతో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, సంబంధిత అధికారులతో జాయింట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల ఖాళీ పోస్టుల భర్తీ, సిమ్ రీఛార్జ్ సమస్య పరిష్కారం, ఆన్‌లైన్ యాప్‌లతో పాటు ఫిజికల్ రికార్డులు నిర్వహించాలంటూ విధిస్తున్న అదనపు పనిభారం తగ్గించడం, సచివాలయాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కూర్చోబెట్టి సంతకాలు చేయించే విధానాన్ని నిలిపివేయడం వంటి సమస్యలను నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ANC ఫాలోయింగ్ పేరుతో జీతాలు నిలిపివేస్తామని బెదిరింపులు చేయకుండా చూడాలని, కొత్త బాపట్ల జిల్లా ప్రాతిపదికన ఒకే తేదీన జీతాలు చెల్లించాలని కోరారు. NPCI లింక్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యను పరిష్కరించి కేంద్ర ప్రభుత్వం అందించే రూ.2,800 వాటాను రెగ్యులర్ వేతనం జమయ్యే ఖాతాలోనే జమ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను జనాభా ప్రాతిపదికన వెంటనే భర్తీ చేయాలని బాబూరావు కోరారు. సీఐటీయూ నాయకులు కె. శరత్, ఎం. కిరణ్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాల్సిన వారని, వారిని రోజంతా సచివాలయాల్లో కూర్చోబెట్టి సంతకాలు చేయించడం వంటి విధానాలను నిలిపివేయాలని కోరారు. ఆన్‌లైన్ పనులతో పాటు అదనంగా ఫిజికల్ రికార్డులు రాయించడాన్ని నిలిపివేసి పనిభారాన్ని తగ్గించాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి. ధనలక్ష్మి, కార్యదర్శి ఎం. వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ జీతాల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, NPCI, సిమ్ రీఛార్జ్ తదితర సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జాయింట్ మీటింగ్‌లో లేవనెత్తిన సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ ఎస్. విజయమ్మ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు, సంబంధిత అధికారులు, ఆశా కార్యకర్తలు సౌభాగ్యం, వాణి, శారద, సుమతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితురాలికి సీఎం భరోసా

మార్టూరు ఆగస్టు 22 వార్త సాక్ష్యం



అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా లభించింది. మార్టూరు మండలం దేగర్లమూడి గ్రామానికి చెందిన జంపని నాగలక్ష్మి వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం కోరగా, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1,03,317 విలువైన ఎల్ఓసీ మంజూరైంది. మంజూరైన ఎల్ఓసీకి సంబంధించిన చెక్కును స్థానిక నాయకులు నాగలక్ష్మికి అందజేశారు. అత్యవసర వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడనుంది. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నాగలక్ష్మి కుటుంబానికి ఈ సాయం కొంత ఊరటనిచ్చింది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని నాయకులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సకు ఇబ్బందులు పడుతున్న వారికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫారసులతో అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నాగలక్ష్మి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరుకు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# పోలింగ్ స్టేషన్లపై ఎమ్మార్వో విచారణ

కర్లపాలెం ఆగస్టు 22 వార్త సాక్ష్యం



కర్లపాలెం మండలంలోని పెదపులుగువారిపాలెం గ్రామంలో పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన అంశాలపై తహసీల్దార్ (ఎమ్మార్వో) రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 220, 221కు సంబంధించి అధికారులు, గ్రామస్థుల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన సమస్యలు, అభ్యంతరాలను అధికారులు పరిశీలించారు. సంబంధిత పత్రాలను పరిశీలించి, విచారణలో వెల్లడైన అంశాలను నమోదు చేశారు. పోలింగ్ స్టేషన్‌ల నిర్వహణకు సంబంధించి స్థానికంగా ఉన్న సమస్యలు, అభ్యంతరాలపై సమగ్రంగా వివరాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు. విచారణలో సంబంధిత అధికారులు పాల్గొని అవసరమైన సమాచారాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.

# పాములపాడు వెలుగు కార్యాలయంలో మహిళలకు శక్తి యాప్ పై అవగాహన







-ఏఎస్ఐ- షేక్.నూర్ అహమ్మద్

పాములపాడు ఆగస్టు 22 వార్త సాక్ష్యం

నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డి.ఎస్.పి- ఆర్.రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు మరియు ఆత్మకూరు రూరల్ సీఐ- ఎం.సురేష్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో ఆత్మకూరు శక్తి టీం సిబ్బంది ఏఎస్ఐ- షేక్.నూర్ అహమ్మద్, ఉమెన్ హోమ్ గార్డ్ సుప్రియ లు పాములపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న ధనలక్ష్మి మండల మహిళా సమాఖ్య భవనంలో హాజరైన మండలంలోని, పొదుపు సంఘాల మహిళా లీడర్ల కు మరియు అక్కడికి హాజరైన వారికి ఏపీఎం ఏ.ఉమా మహేశ్వరమ్మ ఆధ్వర్యంలో శక్తి యాప్ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్ఐ- షేక్.నూర్ అహమ్మద్ మాట్లాడుతూ బాలికల, మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, 18 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని, అట్లా ఎవరయినా చేస్తున్నట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ..ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని అన్నారు. ఫేక్ కాల్స్, ఏపీకె ఫైల్స్ లాంటివి ఏదన్నా సెల్ ఫోన్ వాట్సప్ లకు ఎవరైనా లింక్ మెసేజ్లు పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి, వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలలో శక్తి యాప్ డౌన్ లోడ్ చేసుకొని అత్యవసర సమయాలలో శక్తి యాప్ ను ఎలా వాడాలనీ తెలియజేయడం జరిగింది. దానీ ఉపయోగాల గురించి తెలుపడమే కాకుండా శక్తి యాప్ ను వారి సెల్ ఫోన్ లలో డౌన్లోడ్ చేయించి, ఎవరైనా మీకు ఇబ్బంది పెట్టినట్లయితే అధైర్య పడకుండా మీకు రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " ను ఉపయోగించి 112 కు గానీ, 1098 కి గానీ ఫోన్ చేసి పోలీస్ వారి సహాయం పొందవచ్చు అని అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా 18 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న మైనర్ విద్యార్థులు ఎవరు కూడా మోటార్ సైకిల్ ను నడపడానికి ఇవ్వద్దని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా మీ ఇంట్లోని వారు మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు రక్షణగా " హెల్మెట్ " పెట్టుకొని ప్రయాణం చేయాలని హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి మరియు ఇతరులు లేక మీ ఇంట్లోని వారు మీ భర్త, కొడుకు, అన్నా, తమ్ముడు, మేనమామ లు ఎవ్వరైనా సరే మద్యం త్రాగి వాహనాలను నడపవద్దని చెప్పమని సూచించారు. ఎవరైనా సరే త్రాగి వాహనం నడిపితే, పోలీసులకు చిక్కి కేసు పెడితే కోర్టు వారు 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను విధిస్తారని తెలుపుతూ, అవేర్నెస్ ప్రోగ్రాం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి(వెలుగు) సీసీలు, బుక్ కీపర్లు, మండలంలోని పొదుపు సంఘాల మహిళలు పాల్గొనడం జరిగింది.

# బిజినెస్

## చెక్ బుక్‌లపై కొత్త రూల్స్.. మీ పాత చెక్ ఇక చెల్లదా?



మీరు ఇప్పటికీ బ్యాంకింగ్ లావాదేవీల కోసం చెక్కులను వాడుతున్నారా? అయితే, మీ చెక్ బుక్‌లో కొత్త భద్రతా ఫీచర్లు ఉన్నాయో? లేదో? ఒకసారి సరిచూసుకోవడం చాలా అవసరం. చెక్ మోసాలను అరికట్టి, లావాదేవీల భద్రతను పెంచే లక్ష్యంతో బ్యాంకులు సరికొత్త చెక్ బుక్‌లను జారీ చేస్తున్నాయి. వీటిలో 'ఆల్ఫాన్యూమరిక్ కోడ్' అనే ప్రత్యేకమైన భద్రతా ఫీచర్‌ను జోడిస్తున్నాయి.

**-భద్రత కోసమే కొత్త చెక్ బుక్‌లు**

ఇటీవల బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) వంటి పలు బ్యాంకులు తమ చెక్కులపై ఆల్ఫాన్యూమరిక్ కోడ్‌ను ప్రవేశపెట్టాయి. పాత చెక్ బుక్‌ల స్థానంలో ఈ కొత్త సిరీస్ చెక్ బుక్‌లను తీసుకోవాలని తమ ఖాతాదారులకు సూచిస్తున్నాయి. అక్షరాలు, అంకెల కలయికతో ఉండే ఈ కోడ్, చెక్కులను క్లియరింగ్ సమయంలో సులభంగా గుర్తించి, ధ్రువీకరించడానికి సహాయపడుతుంది. తద్వారా నకిలీ లేదా ట్యాంపరింగ్ చేసిన చెక్కుల ద్వారా జరిగే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని బ్యాంకులు భావిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా 'చెక్ ట్రంకేషన్ సిస్టమ్' (సీటీఎస్) ద్వారా చెక్ క్లియరింగ్ వ్యవస్థను వేగవంతం, పటిష్ఠం చేస్తోంది. ఈ విధానంలో చెక్ భౌతికంగా కాకుండా, దాని ఎలక్ట్రానిక్ ఇమేజ్ ద్వారా క్లియరింగ్ జరుగుతుంది. దీంతో సమయం ఆదా అవ్వడంతో పాటు భద్రత కూడా పెరుగుతుంది.

## డోర్లలో పొంచి ఉన్న ముప్పు.. టెస్లా సహా 40 లక్షల ఎలక్ట్రిక్ కార్లు వెనక్కి!



భద్రతా లోపాల కారణంగా టెస్లా సహా పలు చైనా కార్ల తయారీ సంస్థలు భారీ సంఖ్యలో వాహనాలను వెనక్కి పిలుస్తున్నాయి. ప్రధానంగా కార్ల డోర్ హ్యాండిల్స్‌కు సంబంధించిన సమస్యలే ఇందుకు కారణం. మొత్తంగా 40 లక్షలకు పైగా వాహనాలపై రీకాల్ ప్రభావం పడుతోంది.చైనా స్టేట్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ మార్కెట్ రెగ్యులేషన్ ప్రకారం.. టెస్లా చైనాలో తయారు చేసినవి, దిగుమతి చేసుకున్నవి కలిపి సుమారు 29.8 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలను రీకాల్ చేస్తోంది. ఇందులో మోడల్ 3, మోడల్ వై, మోడల్ ఎక్స్, మోడల్ ఎస్ ఉన్నాయి.తీవ్రమైన ప్రమాదం జరిగి విద్యుత్ వ్యవస్థ పనిచేయకపోతే డోర్ హ్యాండిల్స్ సరిగా స్పందించకపోవచ్చని చైనా నియంత్రణ సంస్థ తెలిపింది. దీంతో కారులో ఉన్నవారు త్వరగా బయటకు రావడం కష్టమవ్వుతుందని పేర్కొంది. బయట ఉన్న రక్షణ సిబ్బంది కారులోకి చేరడానికీ ఇబ్బంది ఎదురయ్యే ప్రమాదం ఉందని వివరించింది.ఈ ఏడాది చైనాలో ఇదే అతిపెద్ద వాహనాల రీకాల్‌గా అక్కడి మీడియా పేర్కొంది. డోర్ హ్యాండిల్స్‌పై చైనా ఇటీవలే దృష్టి పెంచింది. వచ్చే ఏడాది నుంచి కొత్త వాహనాల్లో ఇలాంటి హ్యాండిల్స్‌ను నిషేధించనున్నట్లు ఫిబ్రవరిలో ప్రకటించింది.టెస్లాతో పాటు షియోమీ 3.9 లక్షలకు పైగా వాహనాలను వెనక్కి పిలుస్తోంది. లీప్‌మోటార్ 3.7 లక్షలకు పైగా కార్లను రీకాల్ చేస్తోంది. గీలీ, ఎక్స్‌పెంగ్ సహా మరికొన్ని చైనా సంస్థలు కూడా వాహనాలను వెనక్కి పిలుస్తున్నాయి. రీకాల్ అనేది ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమ ఎదుగుదలలో సహజమైన దశ అని చైనా ప్యాసింజర్ కార్ అసోసియేషన్ అధిపతి కుయ్ డోంగ్‌షు పేర్కొన్నారు. డిజైన్ కంటే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. టెస్లా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ల ద్వారా సమస్యను తగ్గించనుంది.

## బెంగళూరు ప్రయాణికులకు గుడ్‌న్యూస్!.. భారీగా తగ్గిన ఎయిర్‌పోర్ట్ ఫీజు



బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణించే వారికి శుభవార్త. ఎయిర్‌పోర్ట్ యూజర్ డెవలప్‌మెంట్ ఫీజు (యూడీఎఫ్)ను ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఈఆర్ఏ) భారీగా తగ్గించింది. ఈ కొత్త రేట్లు సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు ఐదేళ్ల కాలానికి (2026 ఏప్రిల్ - 2031 మార్చి) కొత్త టారిఫ్ ఆర్డర్‌ను విడుదల చేసింది. ఈసారి తొలిసారిగా విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులపై కూడా ఫీజు విధించడం గమనార్హం.తాజా సవరణ ప్రకారం, దేశీయ విమానాల్లో బయలుదేరే ప్రయాణికులు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ. 550 స్థానంలో ఇకపై రూ. 300 చెల్లిస్తే సరిపోతుంది. అంటే, దాదాపు 45 శాతం మేర ఫీజు తగ్గింది. అంతర్జాతీయ ప్రయాణికులకు ఈ ఫీజు రూ. 1,500 నుంచి రూ. 997కు తగ్గింది. ఇది సుమారు 34 శాతం తక్కువ. మరోవైపు, బెంగళూరుకు వచ్చే దేశీయ ప్రయాణికులు రూ.125, అంతర్జాతీయ ప్రయాణికులు రూ. 426 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు వచ్చిన ప్రయాణికులపై ఎలాంటి ఫీజు లేదు.ఈ మార్పులతో, బెంగళూరు నుంచి రానుపోను ప్రయాణించే దేశీయ ప్రయాణికుడు మొత్తం రూ. 425 (వెళ్లేటప్పుడు రూ. 300 o వచ్చేటప్పుడు రూ. 125) చెల్లిస్తారు. గతంలో ఇది వెళ్లేటప్పుడు రూ. 550గా ఉండేది. ఈ ఫీజును విమాన టికెట్ ధరలోనే కలిపి వసూలు చేస్తారు. రెండేళ్లలోపు పిల్లలు, దౌత్య పాస్‌పోర్ట్ హోల్డర్లు, విధి నిర్వహణలో ఉన్న విమాన సిబ్బందికి ఈ ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. దేశీయ విమానయానాన్ని ప్రోత్సహించేందుకే ఈ ఫీజులను తగ్గించినట్లు ఏఈఆర్ఏ తెలిపింది. ఎయిర్‌పోర్ట్‌లో 84 శాతం మంది దేశీయ ప్రయాణికులే ఉండటం దీనికి ప్రధాన కారణంగా పేర్కొంది.

## మళ్లీ వివాదంలో స్మిత్.. ప్రత్యర్థిని కవ్వించడంతో అంపైర్ల హెచ్చరిక



ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ మైదానంలో తన ప్రవర్తనతో మరోసారి వార్తల్లో నిలిచాడు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో డీఆర్ఎస్ రివ్యూ విషయంలో ప్రత్యర్థి జట్టును రెచ్చగొట్టేలా వ్యవహరించడంతో ఫీల్డ్ అంపైర్లు అతడిని హెచ్చరించారు.ఈ మ్యాచ్‌లో తస్కిన్ అహ్మద్ వేసిన బంతి స్మిత్ ప్యాడ్లను తాకడంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఎల్బీడబ్ల్యూ కోసం అప్పీల్ చేశారు. అయితే ఫీల్డ్ అంపైర్ దానిని నాటౌట్‌గా ప్రకటించడంతో, రివ్యూ తీసుకోవాలా వద్దా అని కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో బౌలర్‌తో చర్చించాడు. బంతి వికెట్ల పైనుంచి వెళ్లే అవకాశం ఉందని తస్కిన్ భావించడంతో వారు రివ్యూకు వెళ్లలేదు. వీరిద్దరి మధ్య జరుగుతున్న సంభాషణను గమనించిన స్మిత్, రివ్యూ తీసుకోవాలంటూ బంగ్లా ఆటగాళ్లను ఉద్దేశించి వ్యంగ్యంగా సంజ్ఞలు చేశాడు.స్మిత్ తీరును గమనించిన ఫీల్డ్ అంపైర్లు వెంటనే అతడిని పిలిచి మందలించారు. ప్రత్యర్థి జట్టు నిర్ణయాల్లో జోక్యం చేసుకోవడం సరైనది కాదని స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, స్మిత్ వంటి సీనియర్ ఆటగాడికి ఇలాంటి ప్రవర్తన తగదంటూ నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

## 'లైక్స్, వ్యూస్ కాదు.. ట్రోఫీలే ముఖ్యం'.. గంభీర్ కీలక వ్యాఖ్యలు



భారత టెస్టు జట్టు కష్టాల్లో ఉందన్న వాదనను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తోసిపుచ్చారు. ఇటీవల ఎదురైన పరాజయాలను పతనంగా చూడొద్దని అన్నారు. జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందని స్పష్టం చేశాడు. తనకు ర్యాంకింగ్స్, సోషల్ మీడియాలో లైక్స్, వ్యూస్ హడావుడి కంటే ట్రోఫీలు గెలవడమే ముఖ్యమని చెప్పాడు. శ్రీలంకతో రెండో టెస్టుకు భారత్ సిద్ధమవుతోంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. కొలంబో టెస్టుతో సిరీస్ విజేత ఎవరో తేలనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టు భారీ మార్పులకు లోనైంది. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో స్వదేశీ సిరీస్‌ల్లో ఓటములు ఎదురయ్యాయి. ఆస్ట్రేలియా పర్యటనలోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. అయినా జట్టు గాడి తప్పిందని అనుకోవద్దని గంభీర్ అన్నాడు. "మేం టెస్టు క్రికెట్‌లో ఇబ్బంది పడటం లేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సహేతుకమైన క్రికెట్ ఆడుతున్నాం. నా పని ట్రోఫీలు గెలవడం. నేను పట్టించుకునేది అదే" అని గంభీర్ స్పష్టం చేశాడు. కొత్త తరం ఆటగాళ్లపై గంభీర్ నమ్మకం వ్యక్తం చేశాడు. కొలంబోలో 20 వికెట్లు తీసే అత్యుత్తమ బౌలింగ్ కూర్పుతో బరిలోకి దిగుతామని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ మంచి బౌలర్ అని పేర్కొన్నాడు. ఒకటి రెండు మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను పక్కన పెట్టకూడదన్నాడు. క్రికెట్‌లో ఎత్తుపల్లాలు సహజమని, ఆటగాళ్లకు మరింత సమయం ఇవ్వాలని సూచించాడు. గిల్, పడిక్కల్, సుతార్‌లపై గంభీర్ విశ్వాసం ప్రకటించాడు. మూడు టెస్టుల సిరీస్‌లకు గంభీర్ మద్దతు తెలిపాడు. తొలి టెస్టులో ఓడిన జట్టుకు పుంజుకునే అవకాశం మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో ప్రస్తుత సిరీస్ రెండు టెస్టులకే పరిమితం కావడంతో రెండో మ్యాచ్ ఫలితమే సిరీస్‌ను నిర్ణయించనుంది.

# స్పోర్ట్స్

## 15 ఏళ్ల వైభవ్.. టెస్టుల్లోనూ అదరగొడతాడా? ద్రవిడ్ ఏమన్నాడంటే!



టీ20 క్రికెట్‌లో సంచలనం సృష్టిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. భవిష్యత్తులో టెస్టు క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని తీసుకురాగలడని భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు. అయితే 15 ఏళ్ల వైభవ్ ఎదుగుదలను జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించాడు. అతడికి తగినంత సమయం, అనుభవం ఇవ్వాలని చెప్పాడు.వైభవ్ దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరఫున ఆడనున్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో ఇప్పటికే సత్తా చాటిన అతడికి.. రెడ్‌బాల్ క్రికెట్‌లో నిలకడ సాధించేందుకు ఇది కీలక అవకాశం. 2025 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున వైభవ్‌కు ద్రవిడ్ కోచ్‌గా వ్యవహరించాడు.వైభవ్ ఇప్పటివరకు ఎనిమిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. అతడి సగటు 17.25గా ఉంది. దేశవాళీ రెడ్‌బాల్ క్రికెట్‌లో ఎక్కువకాలం వరుసగా ఆడే అవకాశం అతడికి ఇప్పటివరకు పెద్దగా దక్కలేదు. దులీప్ ట్రోఫీతో ఆ లోటు తీరే అవకాశం ఉంది. సెప్టెంబరులో ఆస్ట్రేలియా-ఏతో ఇండియా-ఏ రెండు అనధికారిక టెస్టులు ఆడనుంది. ఈ మ్యాచ్‌లు కూడా వైభవ్‌కు ఉపయోగపడే అవకాశముంది.టీ20 క్రికెట్‌కు, టెస్టు క్రికెట్‌కు చాలా తేడా ఉంటుందని ద్రవిడ్ పేర్కొన్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇన్నింగ్స్‌ను నిర్మించడం, ఒత్తిడిని తట్టుకోవడం, ఎక్కువసేపు ఏకాగ్రతతో బ్యాటింగ్ చేయడం వైభవ్ నేర్చుకోవాల్సి ఉంటుందని చెప్పాడు.వైభవ్ సూర్యవంశీకి ఇంకా 15 ఏళ్లేనని ద్రవిడ్ గుర్తు చేశాడు. అతడి కెరీర్‌లో విజయాలతో పాటు వైఫల్యాలు కూడా వస్తాయని పేర్కొన్నాడు. అందుకే అతడిపై ఓపికతో వ్యవహరించాలని సూచించాడు.టెస్టు క్రికెట్ మనుగడ సాగించాలన్నా, ఎదగాలన్నా మూడు ఫార్మాట్లలో ఆడగల ఆటగాళ్లు అవసరమని ద్రవిడ్ అన్నాడు. వైభవ్ భవిష్యత్తులో భారత్ తరఫున టెస్టు ఆటగాడిగా ఎదిగితే ప్రపంచ క్రికెట్‌కే అది ఆసక్తికర పరిణామమవుతుందని పేర్కొన్నాడు.

వార్త సాక్ష్యం
ఆదివారం 23 ఆగష్టు 2026

# ‘జన నాయగన్’ (జీ 5) మూవీ రివ్యూ!

తమిళంలో విజయ్ కథానాయకుడిగా రూపొందిన సినిమానే ‘జననాయగన్’. తెలుగులో బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన ‘భగవంత్ కేసరి’ సినిమాకి ఇది రీమేక్. విజయ్ సినిమాను తెలుగులో ఈ సినిమాను ‘జననాయకుడు’టైటిల్ తో రిలీజ్ చేశారు. హెచ్ వినోత్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, జులై 23వ తేదీన థియేటర్లకు వచ్చింది. అనిరుధ్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, ఈ నెల 21వ తేదీ నుంచి ‘జీ 5’ స్ట్రీమింగ్ అవుతోంది.దవెట్రి కొండాన్ ( విజయ్) కొంతకాలంగా జైల్లో ఖైదీగా శిక్షను అనుభవిస్తూ ఉంటాడు. జైలు అధికారి ( గౌతమ్ మీనన్)కి అతని వ్యక్తిత్వం నచ్చుతుంది. చావుబతుకుల్లో ఉన్న తల్లిని చివరి చూపు చూసేందుకు వెట్రికి అవకాశం ఇస్తాడు. అంతే కాకుండా ఆగస్టు 15 సందర్భంగా క్షమాభిక్ష జాబితాలో వెట్రి పేరును చేర్చి అతను విడుదలయ్యేలా సహకరిస్తాడు. అయితే ఆ తరువాత ఆ పోలీస్ అధికారి చనిపోవడంతో అతని కూతురు విజ్జి (మమితా బైజు) ఒంటరి అవుతుంది. దాంతో విజ్జి బాధ్యతను వెట్రి తీసుకుంటాడు. చిన్నప్పుడు తల్లిని కోల్పోయిన దగ్గర నుంచే విజ్జికి ఒక భయం .. బలహీనత ఏర్పడతాయి. ఆ రెండిటినీ దూరం చేసి, ఆర్మీలో చేర్పించాలనే ఆమె తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలని వెట్రి నిర్ణయించుకుంటాడు. ఆ దిశగా ఆమెను నడిపించడానికి కఠినమైన శిక్షణను ఇప్పిస్తుంటాడు. అయితే ఆమెకి మాత్రం ఆర్మీ దిశగా వెళ్లడం ఎంతమాత్రం ఇష్టం ఉండదు. తాను ప్రేమించిన సురేశ్ తో పెళ్లి చేసుకుని లైఫ్ లో సెటిలైపోవాలని ఆమె ఆశపడుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు రాజకీయాలను శాసించే స్థాయికి రోజా రంగస్వామి (ప్రకాశ్ రాజ్) చేరుకుంటాడు. అనుచరులను .. ఆయుధాలను చూపిస్తూ అరాచకాలు సృష్టిస్తూ ఉంటాడు. అదే సమయంలో జాన్ హిమ్లర్ (బాబీ దేవోల్) రంగంలోకి దిగుతాడు. తాను తలపెట్టిన ‘ప్రాజెక్ట్ ఎమ్ ఎమ్’ను పూర్తి చేయడం అతని లక్ష్యం. అందుకోసం అతను రోజా రంగస్వామితో చేతులు కలుపుతాడు. అదే సమయంలో విజ్జీని అంతం చేయడానికి అనుచరులను నియమిస్తాడు. జాన్ హిమ్లర్ ఎవరు? ఆయన నేపథ్యం ఏమిటి? ఆయన తలపెట్టిన ప్రాజెక్టు ఉద్దేశం ఎలాంటిది? విజ్జీని అంతం చేయాలని అనుకోవడానికి కారణం ఏమిటి? ఆమెలోని భయాన్ని పోగొట్టాలనే వెట్రి ప్రయత్నం ఫలిస్తుందా? మాఫియా వైపు నుంచి హిమ్లర్ ను .. రాజకీయాల వైపు నుంచి రోజా రంగస్వామిని వెట్రి ఎలా ఎదుర్కొంటాడు? ఆ విషయంలో ఆయనకి ఎదురయ్యే పరిణామాలు ఎలాంటివి? అసలు ఆయన జైలుకు ఎందుకు వెళ్లాడు? అనేది మిగతా కథ.తనపట్ల మానవతావాదంతో వ్యవహరించిన ఒక పోలీస్ ఆఫీసర్ కూతురును ఒక ఖైదీ చేరదీయవలసి వస్తుంది. ఆ పోలీస్ ఆఫీసర్ ఆశయం దిశగా ఆ కూతురును నడిపించవలసి వస్తుంది. అదే సమయంలో లోకల్ గా ఉన్న రాజకీయనాయకుడి అరాచకాలను .. ఆయన సపోర్టుతో దేశంలో అల్లకల్లోలం సృష్టించాలనుకున్న ఒక మాఫియా లీడర్ ను కూడా వెట్రి ఎదుర్కోవలసి వస్తుంది. తన ముందున్న ఈ సమస్యలను ఆయన ఎలా ఛేదిస్తూ వెళ్లాడు? అనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ ఈ కథను బిగిస్తూ వెళ్లారు.ఈ సినిమా మొదలైన తరువాత ఆడియన్స్ కి కలిగే మొదటి సందేహం, వెట్రి ఎందుకు జైలుకు వెళ్లవలసి వస్తుంది? అనే. ఇక ఆ తరువాత లోకల్ గా రోజా రంగస్వామిని .. పై నుంచి దిగిన ‘హిమ్లర్’ ను ఆయన ఎలా ఢీకొట్టనున్నాడు? అనేది టెన్షన్. ఇక ఈ మూకనందరినీ దాటుకుని, ఆ పోలీస్ ఆఫీసర్ కూతురును అతను ఎలా కాపాడుకుంటాడు? అనేది ఫైనల్ టెన్షన్. హీరో అధిగమించవలసిన ఈ సవాళ్ల జాబితా చూసుకుంటే కొంచెం బీపీ పెరగడమైతే ఖాయమేనని చెప్పాలి.ఈ సినిమాను తెలుగులో భారీ హిట్ కొట్టిన ‘భగవంత్ కేసరి’కి రీమేక్ గా తెరకెక్కించారు. అయితే ‘భగవంత్ కేసరి’లో కనిపించే ఎమోషన్ ఈ సినిమాలో మిస్సయింది. ఇక హీరోకి సంబంధించిన ఎలివేషన్స్ పై ఎక్కువగా దృష్టి పెట్టడం వలన కూడా అసలు కథ పలచబడిపోయినట్టుగా అనిపిస్తుంది. కథలోని



మార్పులు .. చేర్పులు కొంతవరకూ దెబ్బతీశాయనే భావన కలగకండా ఉండదు. తనని నలుగురిలో అవమానించిన రోజా రంగస్వామితో హిమ్లర్ డీల్ కుదుర్చుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

# మూడోసారి గర్భం రూమర్స్ పై కరీనా కపూర్ ఫన్నీ రియాక్షన్!

బాలీవుడ్ నటి కరీనా కపూర్ తన మూడో ప్రెగ్నెన్సీపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలకు తనదైన శైలిలో సరదాగా స్వస్తి పలికారు. ఇటీవల ఆమెకు సంబంధించిన కొన్ని ఫోటోలలో పొట్ట కాస్త పెరిగినట్లు కనిపించడంతో, కరీనా గర్భవతి అంటూ పెద్ద ఎత్తున ప్రచారం మొదలైంది. ఈ వార్తలపై కరీనా శనివారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ వేదికగా స్పందించారు. పొట్ట పెరిగినట్లు ఉన్న ఓ వ్యక్తి ఫోటోను షేర్ చేస్తూ, దానికి ‘హట్ న బే’ అనే క్యాప్షన్‌ను జత చేశారు. దానికి నవ్వుతున్న ఎమోజీలను, పిజ్జా ఎమోజీని జోడించారు. అంతేకాకుండా, ‘హమ్ ఆప్కే హై కౌన్’ చిత్రంలోని ‘చాక్లెట్ లైమ్ జ్యూస్’ పాటను బ్యాక్‌గ్రౌండ్‌లో ఉంచారు. తద్వారా తన పొట్ట పెరగడానికి కారణం గర్భం కాదని, పిజ్జా వంటి ఆహారం పదార్థాలేనని ఆమె పరోక్షంగా స్పష్టం చేశారు.దగతంలోనూ ఇటువంటి పుకార్లు వచ్చినప్పుడు కరీనా బంధువు సబా పటౌడీ స్పందించారు. కెమెరా యాంగిల్ సరిగ్గా లేకపోవడం వల్లే ఆ ఫోటోలో కరీనా అలా కనిపించారని, ఆమె ఎంతో స్లిమ్‌గా, క్లాసీగా ఉన్నారని వెల్లడించారు. అనవసరమైన ఊహాగానాలకు దూరంగా ఉండాలని ఆమె కోరారు. ఇదివరకు న్యూయార్క్ వెకేషన్ సమయంలోనూ ఇలాంటి రూమర్స్ రాగా, “అదంతా పిజ్జా, వైన్ మహిమ” అంటూ కరీనా వాటిని కొట్టిపారేయడం విశేషం.



## నాన్నా.. నువ్వే నా తొలి హీరో

మెగాస్టార్ చిరంజీవి ఆగస్టు 22 తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు,సినీ, రాజకీయ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో, ఆయన తనయుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తండ్రికి సోషల్ మీడియా వేదికగా అత్యంత హృద్యమైన రీతిలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. తన జీవితంలో తండ్రి స్థానం ఏమిటో వివరిస్తూ చరణ్ పెట్టిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో చరణ్ ఓ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. “పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్నా. మీరే నా మొదటి హీరో, నా అతిపెద్ద స్ఫూర్తి. ప్రతి విషయంలో నేను సంప్రదించేది మిమ్మల్నే. నా జీవితంలోని ప్రతి ఎత్తుపల్లంలో మీ ప్రేమ, మార్గదర్శకత్వం, నాపై మీరు ఉంచిన నమ్మకమే నాకు అతిపెద్ద బలంగా నిలిచాయి. మీరు నా జీవితంలో ఉండటం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. మీకు సంపూర్ణ ఆరోగ్యం,సంతోషం కలగాలని, మరెన్నో అద్భుతమైన సంవత్సరాలు గడపాలని కోరుకుంటున్నాను. మాటల్లో చెప్పలేనంత ప్రేమతో... నాన్నా” అని రాసుకొచ్చారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.